రేషన్ పరేషాన్..!



- పేదింట్లో ఉడకని కందిపప్పు
- 35 శాతం మంది కార్డుదారులకే పంపిణీ

గుడ్లవల్లేరు: పండగలకు సైతం కొందరి పేద కుటుంబాల ఇళ్లలో కందిపప్పు ఉడకటం లేదనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. మార్కెట్లో కందిపప్పు ధర ఆకాశాన్ని అంటుతోంది. ఒక్కో ప్రాంతాన్ని బట్టి కిలో రూ.160 నుంచి రూ.190 వరకూ మార్కెట్లో దుకాణదారులు విక్రయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తెల్ల రేషను కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం కందిపప్పు రేషను ద్వారా పూర్తి స్థాయిలో ఇవ్వకపోవటంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం 35 శాతం మందికే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి. గుడ్లవల్లేరు మండలంలో 15 వేలకు పైగా కార్డుదారులకు 41 రేషను దుకాణాలు ఉన్నాయి. 10 ఎండీయూ వ్యానుల ద్వారా రేషను సరుకులను సరఫరా చేస్తున్నారు. 215 టన్నుల బియ్యాన్ని మండలంలో పంపిణీ చేస్తున్నారు. అర కిలో పంచదారతో పాటు కిలో కందిపప్పు చొప్పున రూ.67కే ఒక్కో కార్డుదారునకు అందించాల్సి ఉంది. కాని ముందు వెళ్లిన కొద్దిమంది కార్డుదారులకు తప్ప అందరు వినియోగదారులకు అందటం లేదని బాధితులు చెబుతున్నారు. బియ్యం, పంచదారతో పాటు కందిపప్పును ఇస్తామని కూటమి నాయకులు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చాక అరకొరగా పంపిణీ చేస్తున్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

కందిపప్పు అందరికీ ఇవ్వాలి



బియ్యంతో పాటు ఇచ్చే కందిపప్పు అరకొరగా ఇస్తున్నారు. ముందు వచ్చిన వాళ్లకే అది కూడా ఉంటుంది. ఆ తర్వాత వచ్చే వాళ్లకు లేనట్లే. అందరు కార్డుదారులకు సమానంగా కందిపప్పు ఇస్తుంటే ఇలాంటి విమర్శలు ప్రభుత్వం మీద రావు. ఇప్పటికైనా వచ్చే నెల నుంచి ప్రభుత్వం అందరికీ కందిపప్పు ఇచ్చే ఏర్పాటు చేయాలి.

– సోమగాని కొండలరావు, డోకిపర్రు, గుడ్లవల్లేరు మండలం

పేదలపై చిన్నచూపు



పేదలకు తెల్ల రేషను కార్డులపై ఇచ్చే కందిపప్పును కూడా ప్రభుత్వం సరిగా ఇవ్వకుండా చిన్నచూపు చూస్తోంది. కేవలం 35 శాతం మందికే పంపిణీ చేసేసి చేతులు దులుపుకుంటే ఎలా ? పూర్తి స్థాయిలో తెల్ల రేషను కార్డులు ఉన్న ప్రతి పేద కుటుంబానికి కందిపప్పు రేషనులో అందేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బసవ వెంకట శ్రీనివాసరావు, గుడ్లవల్లేరు మండల సీపీఎం నాయకుడు

చర్యలు తీసుకుంటాం

కందిపప్పు సరఫరాలో ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకుంటాం. ఈసారి పూర్తి స్థాయిలో కార్డుదారులకు పంపిణీ జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. వచ్చే నెల నుంచి నూటికి నూరు శాతం మండలంలోని తెల్ల రేషను కార్డుదారులందరికీ కందిపప్పు అందేవిధంగా చర్యలు తీసుకుంటాం.

– కిరణ్, పీడీఎస్ డీటీ

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



పామర్రు: పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో స్థానిక లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకయ్య, సభ్యులు లంకపల్లి శ్రీనివాసరావు, బైసాని నాగేశ్వరరావు, అప్పారావు, కె.చంద్రశేఖర్‌రావు, తోట రమేష్, పార్టీ నాయకులు గణేష్, ప్రవీణ్‌చంద్ర, వీరాంజనేయులు, సుబ్రహ్మణ్యం, హైస్కూల్ హెచ్ఎం ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

పామర్రు: స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వీ గణేష్, కె ప్రవీణ్‌చంద్ర, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శోభన్‌బాబు, వీరాంజనేయులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత



పమిడిముక్కల: ఐనపూరు హైస్కూల్‌కు శ్రీ షిర్డి సాయి సేవా సమాజ్ అధ్యక్షుడు దొడ్డపూర్ణచంద్రరావు రూ.15 వేల విలువైన విద్యాసామగ్రిని బహూకరించారు. హైస్కూల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం స్వామి, పూర్ణచంద్రరావు విద్యార్థులకు నోట్ ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. దాత పూర్ణచంద్రరావును ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



పమిడిముక్కల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గుడివాడ డీవైఈఓ ఐ.పద్మారాణి తెలిపారు. తాడంకి హైస్కూల్ పూర్వ విద్యార్థి అరిగె ప్రభాకరరావు కుమారుడు అజయ్ క్రీడాకారులకు క్రీడాదుస్తులు బహూకరించారు. వీటిని పద్మారాణి విద్యార్థులకు అందజేశారు. రాష్ట్ర స్థాయి అండర్-17 కబడ్డీ పోటీలకు ఎంపికైన బొల్లెద్దు అభినయ్ తేజ్‌ను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రవీంద్రబాబులను అభినందించారు. ఇన్‌చార్జి హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం అవార్డు గ్రహీతకు సత్కారం



గుడివాడ టౌన్: ఆంధ్రప్రదేశ్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న బొప్పన విజయ భాస్కర్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని విద్యాలయ పాఠశాల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనకు అభినందనసభ నిర్వహించి సత్కరించారు. కార్యక్రమంలో విద్యాలయ ఉపాధ్యాయులు శ్రీధర్, కృష్ణమూర్తి, రాము పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు



ముదినేపల్లి రూరల్: సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు దక్కుతాయని జిల్లా ఐటీఐ కళాశాలల కన్వీనర్ పి.రజిత అన్నారు. స్థానిక స్వాం ఐటీఐ కళాశాల్లో ఉత్తీర్ణతులైన విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక విద్యలో నైపుణ్యాల అభివృద్ధికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ, డైరెక్టర్ కూనపురెడ్డి హరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు పనులు

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో ఎంపీయుపీ స్కూల్ నుంచి వాటర్ ట్యాంక్ వరకు 220 మీటర్లు సీసీ రోడ్డు వేస్తున్నారు. ఎలికే రాంబాబు, పెరుమాళ్ల సత్యనారాయణ, పిండి ఆంజనేయులు, బాదిన వెంకన్న, కార్యదర్శి ఎస్.రాధిక తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో ఫిల్టర్ బెడ్ పనులు



మండవల్లి: మండవల్లిలో రెండో రక్షిత నీటి పథకం మొగలి చెరువు దగ్గర సర్పంచ్ మెండా ఝాన్సీ శనివారం ఫిల్టర్ బెడ్ మరమ్మతు పనులు చేయించారు. సర్పంచ్ మాట్లాడుతూ రక్షిత నీటి పథకం సక్రమంగా కొనసాగితేనే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందజేసే అవకాశం ఉంటుందన్నారు.

వైన్ షాపు వద్దంటూ మహిళల ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, టూటౌన్ సీఐ

గుడివాడరూరల్: గృహాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేస్తే సహించేది లేదని బంటుమిల్లిడ్డులోని నాగన్నచెరువు గట్టు ప్రాంత మహిళలు ఆందోళన చేపట్టారు. నాగన్నచెరువుగట్టు పక్కనే ఉన్న ఓ షాపులో శనివారం మద్యం షాపు ప్రారంభించేందుకు నిర్వాహకులు సిద్ధపడగా విషయం తెలుసుకున్న ఆ ప్రాంత మహిళలు, స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చి షాపు ప్రారంభోత్సవాన్ని అడ్డుకున్నారు. కొంతసేపు రోడ్డుపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మహిళలు పలువురు మాట్లాడుతూ సీఎం చంద్రబాబూ ఇది మీకు న్యాయమేనా నివాస ప్రాంతాల్లో మద్యం షాపులు ఏర్పాటు చేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఊరి బయట మద్యం షాపులు ఏర్పాటు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం జన నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. నిన్నటి వరకు ఇక్కడ షాపునకు మరమ్మతులు చేస్తుంటే వేరే వ్యాపారం పెడుతున్నారని అనుకున్నామని, తీరా మద్యం షాపు అని తెలిసి అవాక్కయ్యామన్నారు. ఇక్కడ మద్యం షాపు ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల ఉన్న కుటుంబాల వారు చిన్నాభిన్నం అవుతారన్నారు. ప్రశాంతంగా ఉన్న తమ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడానికి వీల్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల ఆందోళన సమాచారం అందుకున్న టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్, ఎక్సైజ్ సీఐ ఎ.వెంకటరమణలు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పెనమకూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాస్, పీడీ బాలస్వామి

తోట్లవల్లూరు: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెనమకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న జగ్గయ్యపేటలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి సమ్మంగి భానుప్రసాద్ 600, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానం, ఎనిమిదో తరగతి విద్యార్థి వల్లూరు అభిషేక్ 200, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పరుగు పందెంలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన భానుప్రసాద్, అభిషేక్‌ను పాఠశాల హెచ్ఎం బొప్పన శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ సంతోషరాణి, పీడీ బాలస్వామి శనివారం అభినందించారు.

డ్రెయిన్లలో వ్యర్థాలు వేయొద్దు



సిల్టు తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

గుడివాడ టౌన్: మురుగునీటి పారుదలకు వ్యర్థాలు అడ్డంకిగా ఉంటున్నాయని అందువల్ల డ్రెయిన్లలో వాటిని వేయొద్దని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. శివారు ప్రాంతాల వీధుల్లో సిల్టు తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. మురుగునీరు నిల్వ ఉండటంతో వాతావరణం కలుషితమై అనేక వ్యాధులు సంభవిస్తాయన్నారు. మురుగునీటి ప్రవాహానికి ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ అడ్డంకి కలిగిస్తున్నాయన్నారు. ప్రజలే వాటిని డ్రెయిన్లలో వేయకుండా సహకరించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ డిసెంబరులో పక్కా ఇళ్లకు నిధుల మంజూరు

గుడ్లవల్లేరు: డిసెంబరులో ప్రభుత్వం పక్కా ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్లు గుడ్లవల్లేరు హౌసింగ్ ఏఈ ఆలపాటి సురేంద్ర శనివారం తెలిపారు. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులే పక్కా ఇంటి మంజూరుకు అర్హతగా సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఆవాస్ సాఫ్ట్ సర్వేను నవంబర్ ఒకటో తేదీ నుంచి 31వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఈ సర్వేను గ్రామ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్లలో ఎవరైనా చేయనున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి ఇంటికీ రూ.1.80 లక్షలను మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. కొత్తగా నిర్మించే పక్కా ఇళ్లకు ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఇంటి నిర్మాణ అంచనాలు అమలు అవుతాయని సురేంద్ర తెలిపారు.

■ ఉచిత నేత్ర వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో అంగలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల్లో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుడివాడ లయన్స్ కంటి ఆస్పత్రి వారు 150 మందికి ఈ పరీక్షలు చేశారు. స్వర్గీయ అరికెపూడి శివ హర్ష స్మారకార్థం తండ్రి ఏఆర్‌కే చౌదరి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ శశికళ తెలిపారు.

■ ఆధార్ అప్‌డేట్ చేయించుకోండి

గుడ్లవల్లేరు: ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్‌మోహనరావు అన్నారు. స్థానిక పోస్టాఫీస్‌లోని ఆధార్ కేంద్రాన్ని శనివారం ఎంఈఓలు సందర్శించారు. ఆధార్‌ను ఎలాంటి డాక్యుమెంట్స్‌ను అందిస్తే మారుస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆధార్‌లో ఉన్న డేట్ ఆఫ్ బర్త్ గాని నేమ్ చేంజ్ గాని డేట్ బర్త్ సర్టిఫికెట్ ప్రకారమే జరుగుతుందన్నారు. ఇది అపార్ ఐడీ కోసం కచ్చితంగా అవసరమైనవని చెప్పారు. అపార్ ఐడీ క్రియేట్ చేయుటకు ఆన్‌లైన్‌లో డేటా కరెక్ట్‌గా ఉండాలన్నారు. ఇది మార్చుటకు ఆధార్ ఒక్కటే మార్గమన్నారు. అందుకే ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది, సీఆర్ఎంటీలు మాధవరావు, పరమేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

■ విద్యార్థుల సమస్యలు పరిష్కరించే ఐపీఏ

గుడ్లవల్లేరు: విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్(ఐపీఏ)ను 1939నుంచే జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు ఆ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ టి.వి.నారాయణ అన్నారు. చిత్రం గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ కళాశాల్లో శనివారం ఐపీఏ స్టూడెంట్ ఫోరమ్ వీవీఐపీఎస్ చాప్టర్‌ను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

■ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కైకలూరు: వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో రసాయనిక, భౌతికశాస్త్రాల అధ్యాపకుల ఆర్థిక సాయంతో 2024–25లో నూతనంగా చేరిన కెమిస్ట్రీ మేజర్ విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వై.శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎంచుకున్న లక్ష్యానికి తగిన విధంగా ప్రణాళికతో చదవాలన్నారు.

■ పాఠశాల వార్షిక తనిఖీ

ముదినేపల్లి రూరల్: మండలంలోని చినకామనపూడి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ కె.నరేష్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, నిధుల వినియోగం గురించి పూర్తిస్థాయిలో తెలుసుకున్నారు. తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం నూరు శాతం అమలు జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందజేయాలని సూచించారు.

వెంకన్నకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామికి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. శనివారం దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తాకిడి అధికమైంది. భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకటకృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

శ్మశాన వాటిక రోడ్డుకు మరమ్మతులు




కలిదిండి(కైకలూరు): ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడకుండా దాతలు ముందుకొచ్చి రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. కలిదిండి మండలం కొండంగి–పల్లెపాలెం గ్రామంలో శ్మశాన వాటిక రహదారి ఇటీవల వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. దీంతో గ్రామస్తులు, చేపల రైతులు, కూటమి నేతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రోడ్డు మరమ్మతులకు పూనుకున్నారు. దాతల సాయంతో మొత్తం మూడు కిలోమీటర్ల మేర రహదారిపై గుంతలను పూడ్చుకున్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఇంటి చెంతనే బోధన



గుడ్లవల్లేరు: మంచం మీద నుంచి కదల్లేని స్థితిలో ఉండే దివ్యాంగ విద్యార్థులకు ఇంటి వద్దనే బోధన చేపట్టినట్లు సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా సహిత విద్య కో–ఆర్డినేటర్ ఎస్.రాంబాబు అన్నారు. శనివారం వడ్లమన్నాడులో కదల్లేని స్థితిలో ఉన్న విద్యార్థి ఇంటికి ఆయన వెళ్లారు. ఇలాంటి విద్యార్థులకు ఇంటి వద్దకే ప్రతి శనివారం తమ ఉపాధ్యాయులు వచ్చి కృత్యాధార బోధన చేస్తారన్నారు. సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఫిజియోథెరపీ, అలవెన్సులు, మెడికల్ అసెస్మెంట్ క్యాంప్‌లు నిర్వహించి, ఉపకరణాలు పంపిణీ చేస్తారని తెలిపారు. సమగ్ర శిక్ష ఏపీఓ కె.ఏడుకొండలు, ఐఈఆర్టీ అబ్దుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభం



కైకలూరు: మండలంలోని వేమవరప్పాడులో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీల క్రీడా కోర్టును టౌన్ ఎస్ఐలు ఆర్.శ్రీను, డి.వెంకటకుమార్ శనివారం ప్రారంభించారు. ఎస్ఐలు మాట్లాడుతూ క్రీడలు మానసిక ప్రశాంతత అందిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు అవసరమని చెప్పారు. లయోలా యూత్ అధ్యక్షుడు భూపతి ప్రకాష్ మాట్లాడుతూ పరిశుద్ధ ఆత్మల పండగ సందర్భంగా ఆర్‌సీఎం చర్చి వద్ద లయోలా యూత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 31 వరకు పోటీలు జరుగుతాయన్నారు. ఒకటి నుంచి ఏడు నగదు బహుమతులు ఆయా జట్ల విజేతలకు దాతల సాయంతో అందిస్తామన్నారు. వరుసగా రూ.40,000, రూ.30,000, రూ.25,000, రూ.20,000, రూ.15,000, రూ.10,000, రూ.5,000 నగదు బహుమతులతో పాటు బెస్ట్ రైడర్‌కు రూ.2,000, బెస్ట్ డిఫెన్సర్‌కు రూ.5,000 అందిస్తామన్నారు. ఆసక్తికరమైన డూ ఆర్ డై రైడ్ కూడా ఉంటుందని చెప్పారు. చెడుగుడు పోటీలు ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న రాంబాబు, బోయిన గోవర్ధన్, బొడిగడ్డ కిషోర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థిని జోత్స్నకు నగదును అందజేస్తున్న ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు కృష్ణారెడ్డి

పామర్రు: ఉత్తమ ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి వారికి విద్యా పురస్కారాలను అందిస్తున్నామని కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక యలమర్రురోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్లో ఉత్తమ ప్రతిభ గల విద్యార్థినికి నగదు పురస్కారాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో పదోతరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మండలం ఫస్టుగా ఎంపికైన వీరంకి జ్యోత్స్న (10/10) మార్కులు సాధించింది. జ్యోత్స్న తండ్రి నాగప్రసాద్ స్థానిక పాల సేకరణకేంద్రంలో పాలు పోసే సభ్యుడు కావడంతో కృష్ణా మిల్క్ యూనియన్ వారు జ్యోత్స్నకు విద్యా కానుకగా రూ.5 వేలను నగదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మారెడ్డి నారాయణరెడ్డి, రైతు నాయకులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, పడమట రంగారావు, వీరంకి నాగప్రసాద్, సూపర్‌వైజర్ బాషా, వేతన కార్యదర్శి ఆరేపల్లి శ్రీహరి పాల్గొన్నారు.

గాదేపూడిలో రీసర్వే గ్రామసభ

గుడ్లవల్లేరు: మండలంలోని గాదేపూడిలో రీసర్వే గ్రామసభను శనివారం నిర్వహించారు. ఈ సభలో రీసర్వే డీటీ రత్నకుమారి మాట్లాడుతూ రీసర్వేలో రైతులు ఇచ్చే వినతులను స్వీకరించి ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, వీఆర్వో మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో..

మండవల్లి: రీ సర్వే ద్వారా భూసమస్యల పరిష్కారానికి అవకాశం కలుగుతుందని సర్పంచ్ బేతపూడి ఏశాపురాజు పేర్కొన్నారు. మండలంలోని ప్రత్తిపాడులో సర్పంచ్ ఏశాపురాజు అధ్యక్షతన రీసర్వే గ్రామసభ శనివారం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ పాస్‌బుక్‌లో భూ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి అర్జీల ద్వారా తెలియజేస్తున్నారన్నారు. సర్వే డెప్యూటీ తహసీల్దార్ ఎం.సుధారాణి, మండల సర్వేయర్ రాజశేఖరరెడ్డి, గ్రామ సర్వేయర్, వీఆర్వో భానుప్రసాద్ పాల్గొన్నారు.

రేపు జరిగే పాదయాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: గుడివాడ–విజయవాడ రహదారిని బాగుచేయాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. శనివారం సీపీఎం కార్యాలయంలో నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విజయవాడ వెళ్లే రహదారి పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందన్నారు. సోమవారం ఉదయం ఏడు గంటలకు కోమటిగుంట లాకుల వద్ద నుంచి ఈ పాదయాత్ర ప్రారంభిస్తామన్నారు. రోడ్డుకు సమీపంలో ఉన్న ప్రతి గ్రామంలోని ప్రజలను జాగృతిచేస్తూ ఈ పాదయాత్ర కొనసాగుతుందన్నారు. సాయంత్రానికి గుడివాడ పట్టణానికి చేరుకుని నేరుగా ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, ఎన్. మురళీ కృష్ణారెడ్డి, బి.గంగాధర్, ఉమామహేశ్వరరావు, పి. రజిని, ఎల్. సురేంద్ర, కోటేశ్వరరావు, ఆర్.కొండ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడికి ఆక్రమణల చెర వీడేనా..?



ఆక్రమణలకు గురైన పసుమర్తి ధర్మచెరువు

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి బస్టాండ్ చుట్టూ (పసుమర్తి ధర్మచెరువు) ఆక్రమణలకు గురై ఉన్న స్థలానికి సంబంధించి హైకోర్టు ఆదేశాలు అందినప్పటికీ పంచాయతీ అధికారులు మాత్రం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. నోటీసులు తీసుకున్న అనంతరం ఆక్రమణదారులు గడువు కోసం కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకోవటం పరిపాటిగా మారింది. నాట్యక్షేత్రంగా కూచిపూడి గ్రామం అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న తరుణంలో ఈ ఆక్రమణలు ఆటంకాలుగా మారుతున్నాయి. ఈ ధర్మచెరువు ప్రాంతాన్ని సుమారు 42 మంది ఆక్రమించుకుని షాపుల నిర్వహణ చేసుకోవటం, కొందరు అద్దెకు ఇస్తున్నారు. ఆక్రమణలు తొలగించాలంటూ హైకోర్టు ఎనిమిది నెలలు క్రితం ఆదేశాలు ఇచ్చినా నేటికీ ఎక్కడి గొంగడి అక్కడే అన్న రీతిలో ఆక్రమణలు ఉండిపోయాయి. ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులు దృష్టి సారించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీలత

కైకలూరు: వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వై.శ్రీలత బాధ్యతలు చేపట్టారు. విజయవాడ ఎస్ఆర్ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలుగు అధ్యాపకురాలుగా పనిచేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై కైకలూరు డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com